# శ్రీ శ్రీ శ్రీ పూసపాటి రాజాగారు

మాచవరం వెళ్ళే దారిలో చింతావారి కాఫీ హోటలు పక్కన బళ్ళ బుల్లబ్బాయిగారి సమాధి ముందు దిగువలో ఉంది సత్రం. బంగాళాపెంకుల్తో బులుగుపోయిన గోడల్తో కట్టున్న ఆ సత్రం బుడబుక్కలోళ్ళతోనూ పూసలోళ్ళతోనూ, ఎర్రపూసలూ వెంట్రుకలూ కలిపి పేనిన దండలూ అమ్మేవాళ్ళతోనూ, చచ్చిపోయిన ఉడతలూ, ఉడుముల చర్మాల్లోగడ్డి కుక్కి అచ్చం బతికున్నవాట్లాగ తయారు చేసి కుట్టి అమ్మేవాళ్ళతోనూ కిటకిటలాడి పోతుంది. కోతలకాలంలో శ్రీకాకుళం ప్రాంతాలనించి వచ్చే జనంతో నిండిపోయి కళకళ్ళాడిపోతూఉంటది ఆసత్రం. అ శ్రీకాకుళం వాళ్ళని మేమందరం తూర్పోళ్ళు అంటాం.

* * *

నిన్నటిదాకా ఖాళీగా ఉన్న సత్రం ముందు బలభద్రపురం వేపు నించొస్తున్న సబ్బెళ్ళ సత్తిరెడ్డిగారి క్వారీలారీ ఆగడంతోనే అందులోంచి దిగడం మొదలెట్టారు తూరుపోళ్ళు.


వాళ్ళలో ప్రభువుని నమ్ముకుని సువార్తమ్మగా పేరు మార్చుకున్న సారాలమ్మ తన సామాన్లతో పాటు తను పెంచుకునే కోళ్ళ గంపల్ని దింపుకుంటుంటే వాటిల్లోచెయ్యి పెట్టి పుంజుని లాగబోయిన ఆదిగాడ్ని నానాతిట్లూ తిడదామని లేచిందల్లా పూసపాటిరాజు గారున్నారని నోరు మూసేసుకుంది. ముసలిఎర్రయ్య తన పడుచుభార్య గంగాలమ్మతో దిగుతూంటే, బొడ్డు సూరయ్య ఆమె నడుం దగ్గర నిమరబోయి ఆగాడు. అది చూసి అగ్గిమీద గుగ్గిలం అయిపోయిన ఎర్రయ్య "పూసపాటిరాజాగారున్నారు గాబట్టి బతికిపోయేవురోయ్" అన్నాడు. అందర్నీ అరుస్తా కరుస్తా పెత్తనం చెలాయిస్తున్న మేస్త్రి పర్లాకిమిడినాయుడు బక్కపల్చగా పొడుగ్గా ఉన్న పూసపాటిరాజాగార్ని మట్టుకు అత్తారబత్తంగా లారీలోంచి కిందకి దింపేడు ఆయన సామాన్లు సత్రంలో ఓమూల సర్ది పక్కన వేస్తుంటే తక్కినోళ్ళు కూడా వచ్చి సాయం చేస్తున్నారు.

* * *

లక్ష్మివారం మంగళవారం సంతలు జరుగుతాయి మా పసలపూడిలో. కుమ్మరికోటయ్యగారి తాలూకోళ్ళు కుండల దుకాణం పెడతారు. ఆ దుకాణానికి కాస్త దూరంగా ఉల్లిపాయల గంగిరెడ్డిగారి దుకాణం, దేవాంగుల మణి పప్పులమంచం, కళింగసాయిబూ మాంసం దుకాణం, పట్టాభిగుండాట, సోమేశ్వరం వీర్రాజు చక్రం ఆట, రాంపురం నించొచ్చిన రామారావు రొట్టీబిస్కోతు బండి, వీటితో పాటు ఎక్కడెక్కడినించో వచ్చి కొట్లు పెట్టే వాళ్ళతో ఆ సంత రెండ్రోజులూ తీర్థం జరుగుతున్నట్టుంటది వూళ్ళో.

నల్లగా మాంచి బలంగా ఎత్తుగా వుండే స్వరాజ్యరెడ్డిగారు కళింగసాయిబు మాంసం కొట్టు దగ్గర నిలబడి వయసులో ఉన్నప్పుడు ఒక మేకతొడని అమాంతంగా లాగించేసేవాడో ఈతరం వాళ్ళకి చెపుతా "నాతో ఎందుకురా వాగించడం ఆరోజుల్లో వేట మాంసం పచ్చి తాటాకు మంగంలో కట్టిచ్చిన ఈ కళింగసాయిబే సాక్ష్యం చెప్పురా" అంటుండగా చేపల దుకాణం దగ్గర పొలికేకల్లాటివి వినపడితే అటుపక్కకి తిరిగాడు.

వంశీ మా పసలపూడి కథలు-72




ఆ చేపలవాడూ పర్లాకిమిడినాయుడు తెగ కొట్టేసుకుంటున్నారు. చేపలబుట్ట ముందు కూర్చుని మా పూసపాటిరాజుగారికి ఈ చేప నచ్చదు ఆ చేప నచ్చదు అంటూ అరగంట నించి బుట్టలో చేపలన్నీ కెలికేసి బయటికి విసిరేసాడు నాయుడు. కోపమొచ్చిన చేపలోడు లాగి గూబమీద కొట్టేడు. దాంతో పెద్ద గొడవైపోయింది. అప్పుడే కాకీసంచితో అక్కడికి వచ్చిన సొల్లుకిట్టయ్యగారు ఇద్దర్నీ విడదీసేరు.

“పూసపాటి అంటే విజయనగరాన్ని పరిపాలించిన విజయరామరాజుగారి వంశం కదూ? ఆ వంశంలో రాజుగారు మాఊరు వచ్చాడా” అనుకుంటా పర్లాకిమిడి నాయుడ్ని ఎగాదిగా చూసి ఈడు ప్రతి ఏడాదీ కోతల కొచ్చే ఆ తూర్పోళ్ళ మేస్త్రిగదా? అనుకున్నాడు. కాసేపయ్యింది.

ఉల్లిపాయలగంగిరెడ్డి దుకాణం దగ్గర కెళ్ళిన నాయుడు, ఏవండీ ఇవాళ పచ్చిరెయ్యిలూ బెండకాయల పులుసెట్టించి మా పూసపాటిరాజుగారికి వేడన్నం గిన్నెలో వెయ్యాలండి మంచియ్యి ఏరి తుయ్యండి, అంటుంటే నాయుడ్నే చూస్తా “ఎవడా పూసపాటిరాజు?” అని సణుక్కున్నాడు స్వరాజ్యరెడ్డిగారు.

కాసేపయ్యింది. లేత బెండకాయల మొసాలు గిల్లి మరీ ఏరుతున్న గంగిరెడ్డితో “కావాలంటే ఇంకో బేడ డబ్బులు ఎక్కువ పుచ్చుకోండి. పులుసు తినబోయేది ఎవరనుకుంటున్నారు మా పూసపాటిరాజుగారు” అని గంగిరెడ్డి ఏరిన లేతబెండకాయలు దూరంగా విసిరేశాడు.



గొడవ మొదలైంది.

సంత చేసుకుంటున్న సొల్లుకిట్టయ్యగారు మళ్ళీ అటు పక్కకి రావడంతో మళ్ళీ గొడవ.

విడదీసేడు కిట్టయ్యగారు.

కాస్త దూరాన్నించే నాయుడి అల్లరి చూస్తున్న స్వరాజ్యరెడ్డిగారు "అసలా పూసపాటి రాజెవడు రేపు చల్దిపొద్దు వేళప్పుడెళ్ళి పలకరించి రావాలి" అనుకున్నాడు.

* * *

కాకివారిసావరం దగ్గరున్న బ్రాహ్మణరెడ్డిగారి పాతికెకరాల ఏక చెక్క ఈ ఏడు బాగా పండింది. కొయ్యడానికి పర్లాకిమిడినాయుడ్ని పిల్చి "ఈ ఏడాది కూలీలు ఎలాగరా?" అన్నాడు. "కాంట్రాక్టు ఇచ్చెయ్యండిరెడ్డిగారూ" అన్నాడు నాయుడు.

"పంట మొత్తం కోసేసి పనలు కళ్ళంలో పోసి, పచ్చి పనలు ఎద్దులు చేత తొక్కించి, గింజలు ఎగరేసేసి, ధాన్యం గింజలు గోనె బత్తాల్లోకెక్కించి, రెండడ్ల బళ్ళమీద కెక్కించి మనగాదుల్లో వెయ్యడానికి ఇంత అని గుత్తకి కాంట్రాక్టు మాటాడాడు నాయుడు. లాకుల దగ్గర క్వార్టర్సులో ఉండే గంటాగళాసు భార్య దగ్గర్నించి ఒక కోడిపుంజుని కొనుక్కొచ్చి కోసి అమ్మోరికి నైవేద్యమెట్టి మరి పన్లోకి దిగారు.

అంతా పన్లు చేసుకుపోతుంటే మేస్త్రి నాయుడు మట్టుకి కోడి మాంసం ఇగురూ, పప్పుచారూ అన్నం వండాడు. మధ్యాన్నం పూసపాటిరాజుగారూ జనం ఆరగించడం మొదలెట్టారు.

అంతలో వచ్చిన స్వరాజ్యరెడ్డిగారు పూసపాటిరాజుగారెవరో కనుక్కుని దగ్గరకొచ్చి తనెవరో చెప్పి పెరిగిన పచ్చగడ్డిలో చతికిలబడి, ''అయితే మీది పూసపాటివారి వంశమన్నమాట'' అన్నాడు. ''అవునుబాబూ'' అన్నాడు పూసపాటిరాజాగారు.

''నాకు మీ విజయనగరంలో మూడు లాంతర్ల జంక్షనూ, బంకులదిబ్బా, చీపురుపల్లి బస్టాండు తెల్సు అంతే గాదు విజయనగరం అవతల గరివిడి దానవతల చీపురుపల్లి, రాజాం, పొందూరు, హీరమాండలం, శ్రీకాకుళం అక్కడ్నించి ఇచ్చారపురం దాకా కొట్టిన పిండి, పూసపాటి రాజులెలాగుంటారో ఆళ్ళ డాబూ దర్పం ఎలాగుంటాయో కూడా తెల్సు చూడండి పూసపాటి రాజావారు మీ మూరు మూల ప్రాంతం గురించి ఇంత బాగా తెల్సిన నాలాంటోళ్ళుంటారని మీరసలు అనుకోలేదు కదూ? ఆళ్ళకేం తెలుస్తదిలెహె అనేసి ఇలా డప్పాలు కొట్టడం న్యాయమంటారా రాజుగారు'' ఆవేశంగా ఏదో చెప్పడానికి ముందుకొస్తున్న రాజుని ఆగమని సైగ చేసిన స్వరాజ్యరెడ్డి ''తాండ్రపాపారాయుడితో యుద్ధం చేసిన విజయరామరాజు వంశమని గొప్పలు చెప్పుకుని మా పక్కకి కూలి కొస్తావా? వచ్చిందిగాక ఈ అలగా జనాన్ని పోగేసుకుని వీళ్ళతో...రాజుగారు...రాజుగారు అని డప్పేయించుకుంటావా... ఇలాంటి ఎదవ పని జేసి మీ రాజులవంశ గౌరవం తియ్యడానికి సిగ్గులేదురా నీకు?'' అంటూ రెచ్చిపోతుంటే తక్కిన తూర్పోళ్ళంతా స్వరాజ్యరెడ్డి మీదకి దూకెయ్యబోతుంటే వాళ్ళని ఆపిన పూసపాటిరాజు చేతులెత్తి రెడ్డిగారికి నమస్కారం చేసి''పూసపాటి వంశం మీద మీకున్న గౌరవాభిమానాలకు నమస్కారం రెడ్డిగారూ. మావాళ్ళెవరూ వాళ్ళ ప్రభువుల పరువులు తీసే పని చెయ్యరు. మీ పక్కకి కూలి పనికి వచ్చానని తీసి పారెయ్యకండి. నా పేరు పూసపాటి బంగార్రాజు'' అని చెప్పడం మొదలెట్టాడు.

* * *

విజయనగరం జిల్లాలో గజపతి నగరం పూసపాటి బంగార్రాజు ఊరు. వాళ్ళ ముత్తాత వీరవెంకట విజయగోపాలరాజుగారు కాలం చేసేనాటికి వాళ్ళ ఆస్తి మొత్తం ఎనిమిది వందల ఎకరాలు. బంగార్రాజు తండ్రిగారు కాలం చేసేనాటికి మండువాలోగిలీ మూడు ఎకరాలూ ఇవి గాకుండా చుట్టూ అప్పులు.

ఎలాగరా దేవుడోయ్ అని బెంగెట్టుకునుండగా బంగారం లాంటి వార్తొకటి మోసుకొచ్చాడొక కంబారోడు.

అదేంటంటే, తగరపువలసలో మామిడీ, జీడిమామిడీ కల్సిన పదెకరాల తోట పరమ చవగ్గా అమ్మకానికొచ్చింది.

జీడిమామిడి సీజనప్పుడు జీడిపిక్కల ఆదాయం ఇక మామిడి పళ్ళ సీజనప్పుడు పళ్ళ ఆదాయం. పరువుకొచ్చిన కాయలు లారీల మీద కలకత్తా ఎక్స్‌పోర్ట్ చేసుకోవచ్చు. ''ఇన్ని కష్టాలు పెట్టిన దేవుడు ఇప్పుడు కనికరించాడు మరి వెంటనే కొనేసి మకాం ఆ వూరికి మార్చేయరా బంగారీ ముందెళ్ళి బజాణా ఇచ్చేసిరా'' అన్నారు బంధుమిత్రులు.

ఈ మూడెకరాలు అమ్మేసి అప్పులన్నీ తీర్చేసి తగరపు వలసెళ్ళిపోయి ఆ పదెకరాలు కొన్నాడు బంగార్రాజు.

అయితే, బంగార్రాజు కొన్న పదెకరాల తోటని ఆన్చి జోగినాయుడు అనే అతన్ది ఒక ఎకరం నేల ఉంది. ఆ ఎకరంలో అర ఎకరాన్ని ఆక్రమించుకున్న పెద్ద మర్రిచెట్టు ఉంది.

చిలకలూ వేరే పక్షులూ చక్కగా పండిన పూసపాటి బంగార్రాజు తోటలో చెట్లమీద వాలి ఆ పళ్ళని ముక్కున కరుచుకెళ్ళి జోగినాయుడు పొలంలో ఉన్న మర్రిచెట్టు మీద వాలి కడుపారా ఆరగించాకా జీడిగింజల్ని సగం తిన్న మామిడి టెంకల్ని కింద వదిలేస్తున్నాయి.

కింద మంచం వేసుకు పడుకున్న జోగినాయుడు ఆ జీడిగింజల్ని గోనె సంచిల్లోకి ఎత్తుకుంటుంటే నెలకి రెండు బస్తాలవుతుంటే ఆటిని అమ్ముకుంటున్నాడు. మామిడిపళ్ళ సీజన్లో చిలకలు కొట్టేసి పారేసిన మామిడిపళ్ళని తాండ్రవాళ్ళకి అమ్ముకుంటున్నాడు. ఏ సీజన్లో ఆ ఆదాయం. చాలా బాగుంది జోగినాయుడు పని. అదంతా చూస్తున్న బంగార్రాజు నోటిమాట పడిపోయింది ముందు చాలా గొడవ

పడ్డాడు నాయుడితో.

ఏమాత్రం బెసకలేదు జోగినాయుడు. పూసపాటి బంగార్రాజు తోటని కొన్నాకా ప్రతి ఏడాది కంటే చాలా ఎక్కువ పంటలు పండాయి. జోగినాయుడికి ప్రతి ఏడాది కంటే ఎక్కువ ఆదాయం వచ్చింది. దాంతో ఊళ్ళో అసలు ఇంటిని అసలు భార్యనీ అలా ఉంచి మర్రిచెట్టుకింద ఒక తాటాకు పాక వేసి తులసి అనే మనిషితో ఇంకో కాపురం పెట్టాడు.

అదంతా చూస్తున్న పూసపాటి బంగార్రాజు ఒళ్ళు రగులుకుపోయింది.

ఒకరోజు వెళ్ళి "నీ ఎకరం పొలం నాకు అమ్మెయ్" అన్నాడు.

అతని అమాయకత్వానికి నవ్వుకున్న నాయడు "అమ్మాల్సిన అవసరం నాకేంటి?" అన్నాడు.

ఎంత అణిచి పెట్టుకుందావన్నా ఆగడం లేదు కోపం. మాటా మాటా పెరిగింది. చాలా పెద్ద గొడవయ్యింది ఇద్దరికీ.

ఊరుసర్పంచి అసిరయ్యని తక్కిన పెద్దల్ని కల్సి చర్చించి, అందరినీ లేవదీసాడు.

మర్రిచెట్టుకింద కాపురం పెట్టిన జోగినాయుడు దగ్గర కొచ్చిన వాళ్ళంతా చర్చలోకి దిగి జోగినాయుడు ప్రశ్నలకి సమాధానాలు చెప్పలేక చిత్తుగా ఓడిపోయి వెనక్కెళ్ళిపోయారు. ఇది గాదు పని అన్జెప్పి పోలీసుల్ని వెంట బెట్టుకొచ్చాడు బంగార్రాజు.

వచ్చిన వాళ్ళకి సకల మర్యాదలూ చేసిన తర్వాత వాళ్ళ చర్చలోకి దిగిన జోగినాయుడు తనే నెగ్గాడు చివరికి. మళ్ళీకలుస్తాం అన్జెప్పి జీపెక్కి వెళ్ళిపోయారు పోలీసులు.

ఈ పదెకరాల తోట మీద అప్పు తెచ్చిన బంగార్రాజు కాపలాకి పాతికమంది కూలోళ్ళని పెట్టాడు. తనుకూడా కాపలా పడుకున్నాడు. లాభం లేకపోయింది.

ఎవ్వరూ నెగ్గుకు రాలేకపోయారు. ఒక పక్కనించి మునిగిపోతున్నాను చిత్తుగా ఓడిపోతున్నాను అని తెల్సిన రాజు నాయుడు దగ్గరకెళ్ళి "నా తోటని నువ్వే కొనుక్కోగూడదా?" అన్నాడు.

ఈ ప్రశ్నకి జోగినాయుడూ ఆడిముండా గట్టిగా నవ్వుతుంటే మర్రిచెట్టు మీదున్న పక్షులు తుపాకీ దెబ్బకి అదిరిపడ్డట్టు ఒక్కసారిగా ఆకాశంలోకెగిరి కాసేపయ్యేక మళ్ళీ వాలాయి.

అప్పుడు బాగా అర్ధమైంది బంగార్రాజుకి ఈతోట ఎందుకు ఇంత చవగ్గా అమ్మకానికొచ్చిందో.

నిండా మునిగిపోయేడు. ఈ జన్మకి తేలనంతగా మునిగిపోయేడు.

అప్పులిచ్చిన వాళ్ళు ఇంటిచుట్టూ గస్తీ తిరుగుతున్నారు. సర్వం వాళ్ళకి అప్పగించి గోదావరి ప్రాంతాలకి కూలీకెళ్ళే జనంతో కల్సి ఇటు పక్కకొచ్చేశాడు పూసపాటిబంగార్రాజు అనే పూసపాటిరాజుగారు.

స్టోరీ మొత్తం విన్న స్వరాజ్యరెడ్డిగారికి కళ్ళనీళ్ళు తిరిగాయి ఆ తూర్పోళ్ళంతా రాజుగారిని ఎందుకంత గౌరవిస్తున్నారో అర్ధమైంది. చేతులెత్తి నమస్కారం చేస్తూ "మీ గురించి అదోలా అనుకున్నందుకు నేనిప్పుడు చాలా ఇదయిపోతున్నాను రాజుగారూ, మా విశ్వనాధాన్ని పంపిస్తాను వచ్చే ఆదివారం మా ఇంటికి భోజనానికి రావాలి మీరు...ఇదాయికంగా రావాలి మర్చిపోకండోయ్" అనేసి లేచేడు.

* * *